



దుబ్బాక సభకు పెద్ద ఎత్తున హాజరైన జనం, అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి



# తెలంగాణను ముంచిందే.. కాంగ్రెస్ దద్దమ్మలు

## వరదకాల్వలో మోటర్లు పెట్టుకుంటే.. ఎత్తుకుపోయి పోలీస్‌స్టేషన్‌లో వేసేది

ఏనాడైనా తూములు పెట్టి చెరువులు నింపిండ్రా..

గతంలో నీటి తీరువా వసూలు చేసిండ్రు.. బీఆర్‌ఎస్ వచ్చినంకా.. బకాయిలు మాఫీ చేసినం

మళ్లీ ఎవరి కొంప పుచ్చుకోవడానికి.. ఇందిరమ్మరాజ్యం తెస్తరు.?

వారి పాలనను మళ్లీ గుర్తుచేసుకుంటే వణుకే..

దుబ్బాకలో ఎప్పడన్నా కత్తిపోట్లు చూశామా..?

వేములవాడతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది

తెలంగాణ వచ్చిన నాడు ఎలాఉండే.. ఇప్పుడెలా ఉన్నదనేది ఆలోచన చేయాలి

**దుబ్బాక, వేములవాడ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్**

**నేను పుట్టిన గడ్డ,** చదువుకున్న గడ్డ దుబ్బాక. ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానంటే దుబ్బాక పాఠశాల పెట్టిన ఆ చదువు, భిక్షనే కారణం. అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఆదివారం వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిలకు మద్దతుగా నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరై ప్రసంగించారు. మంచి, చెడు ఆలోచించి ఓటేయాలి. ఆగమాగమై ఓటేస్తే మన తలరాత తలకిందులైతది. ఐదేండ్లు శిక్ష అనుభవించాల్సి వస్తది. తెలంగాణకు ప్రథమ శత్రువు కాంగ్రెస్ పార్టీనే. కరెంటు, మంచినీళ్లు, సాగునీళ్లు ఇవ్వకుండా.. రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల ఆకలి చావులకు కారణం వారే. స్వరాష్ట్రంలో సంపద పెరిగిన కొద్ది.. పేదలకు పంచుకుంటూ పోతున్నాం. 24 గంటల కరెంటు.. పెట్టుబడి సాయం కింద రైతుబంధు ఇస్తున్నాం. కాంగ్రెసోళ్లకేమో తమాషా.. మనకేమో జీవన్మరణ సమస్య. మూడేండ్లు కష్టపడి భూ యాజమాన్య హక్కు మీ బొటనవేలికే ఇచ్చినం. అంత మంచి సిస్టం పోగొట్టుకోవద్దు. దుబ్బాకలో ఎప్పుడన్నా కత్తిపోట్లు చూశామా..? ఆ సంస్కారం ఉందా..? ఇక కత్తులే పట్టుకురావాలంటే మనకు దొరకవా.? వాని కంటే పొడవు కత్తులు తేగలుగుతం కదా..? పెద్ద సమస్యనా..? కానీ పద్ధతి కాదని మర్యాద పాటించాం. కోపాన్ని అణిచివేసుకున్నాం. మొన్న బై ఎలక్షన్‌లో గెలిచినోడు నోటికి వచ్చిన వాగ్దానం చేసిండు.. ఏకాన పని జరిగిందా.? ఇటువంటి మోసకారులను నమ్మొద్దు. యావత్ తెలంగాణ వ్యాప్తంగా అసైన్‌మెంట్ భూములకు పట్టాలిస్తాం. దుర్మార్గులు వచ్చి అనేక ఝూటా మాటలు చెప్తరు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలి. దుబ్బాక నెత్తిమీద కుండలా మల్లన్నసాగర్ తెచ్చుకున్నాం. ఎన్నికల తర్వాత నెల రోజుల్లో ఆర్డీవో ఆఫీసు, మూడు కాలేజీలు, చుట్టూ రింగ్ రోడ్డు తీసుకువస్తాం. ఇందిరమ్మ రాజ్యంలో సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాలను కల్లోలిత ప్రాంతాలుగా డిక్లేర్ చేసి ఎంతోమంది యువకులను కాల్చిచంపారు. ఎమర్జెన్సీ పెట్టి లక్షల మందిని జైల్లో వేశారు. మళ్లీ ఎవరి కొంప పుచ్చుకోవడానికి ఇందిరమ్మరాజ్యం తెస్తరు.? మళ్లీ ఆకలికి చావాల్నేమో..? కరెంటు షాకులతో రైతులు చనిపోవాల్నేమో..? అభివృద్ధితో పాటు ఇతర విషయాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీకి నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉన్నది. తెలంగాణ వచ్చిన నాడు చెట్టుకొగలం, పుట్టకొగలం ఉన్నం. గతంలో ఏ పార్టీ ఏం చేసిందో ఆలోచించి ఓటు వేయాలి. అని సీఎం కేసీఆర్ అన్నారు.






వేములవాడ సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, భారీగా తరలివచ్చిన ప్రజలు





జగిత్యాల సభకు పెద్ద ఎత్తున హాజరైన జనం, అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్






# కాంగ్రెస్ వస్తే.. రైతుల చేతికి చిప్పే..

## మళ్లీ కౌలుదారు చట్టం తీసుకువచ్చి.. రైతుల భూమి గోల్‌మాల్ చేస్తరట

పేగులు తెగేదాక కొట్లాడినోడు ఎవడు.? తెలంగాణ తెచ్చినోడు ఎవడు.?

ధరణి లేకుంటే ఎన్ని పంచాయితీలు అవుతుండే.? ఎన్ని తలకాయలు పగిలిపోతుండే..?

జగిత్యాల జిల్లా అయితదని అనుకున్నమా.?

కాంగ్రెసోళ్లు ఇప్పడొచ్చి మా అంత సిపాయి లేరని మాట్లాడుతున్నరు

వాళ్ల సుట్టాలు దళారులు, పైరవీకారులు, లంచగొండి అధికారులు

అధికారమిస్తే రైతుల నోట్లో మన్ను వోస్తం.. అని ఖుల్లం కుల్లాగా చెప్తున్నరు

వాళ్ల ఆలోచనలన్నీ దుర్మార్గమైనవి.. ఇవన్నీ భరిస్తామంటే మీ ఖర్మ..

**ఖానాపూర్, జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్**

**కాంగ్రెస్ మళ్లీ కౌలుదారు చట్టం** తీసుకువస్తామని చెబుతున్నది. ఇలా రెండేండ్లు కౌలురైతు ఉంటే మూడో ఏడాది రైతుల భూమి గోల్‌మాల్ అవుతుంది. రైతులు చిప్పపట్టుకొని తిరగాల్సి వస్తది. అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఆదివారం ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భూక్య జాన్సన్ రాథోడ్, జగిత్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌లకు మద్దతుగా జరిగిన ప్రజా ఆశీర్వాద సభలకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరై ప్రసంగించారు. ఆనాడు కిరణ్‌కుమార్ రెడ్డి తెలంగాణకు రూపాయి కూడా ఇవ్వనంటే.. ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే అయినా మాట్లాడిండా..? నోరు తెరిచిండ్రా..? తెలంగాణ రాష్ట్రంలో భాగం కాదారా సన్నాసి..? గట్ల ఎట్ల మాట్లాడుతవ్ అని తిరగబడ్డరా..? పేగులు తెగేదాక కొట్లాడినోడు ఎవడు.? తెలంగాణ తెచ్చినోడు ఎవడు.? 24 గంటల కరెంటు ఇచ్చినోడు, ప్రతి ఇంట్లో నల్లా పెట్టి నీళ్లిచ్చినోడు ఎవడు..? కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినోడు ఎవడు? కాంగ్రెసోళ్లు ఇప్పుడొచ్చి మా అంత సిపాయి లేరని మాట్లాడుతున్నరు. ధరణి లేకుంటే భూముల ధరలు పెరిగిన దానికి ఎన్ని పంచాయితీలు అవుతుండే.? ఎన్ని తలకాయలు పగిలిపోతుండే..? ఎన్ని కేసులు అవుతుండే.? ఒక్కసారి ఆలోచన చేయాలి. పాత కాంగ్రెస్ పాలన ఎట్లుండే మళ్లీ అదే పాలన మొదలవుతది. వారికి దళారులు, పైరవీకారులు, లంచగొండి అధికారులే సుట్టాలు.. అని బాజాప్తా చెప్తున్నరు. అధికారంలోకి వస్తే రైతుల నోట్లో మన్ను వోస్తం.. అని ఖుల్లం కుల్లాగా అంటున్నరు. ఇక్కడ జీవన్‌రెడ్డితోని ఏం అవుతది.. ముఖ్యమంత్రి అయినోడికి భజన చేయడం తప్ప.. రైతులకు కాంగ్రెస్ ఒక ఆశనీపాతం. తెలంగాణ ప్రజలకు శని, రైంతాగానికైతే మరీ దరిద్రం. వాళ్ల ఆలోచనలన్నీ దుర్మార్గమైనవి. ఇవన్నీ మేం భరిస్తామంటే మీ ఖర్మ.. నేనేం చేయలేను. జగిత్యాల జిల్లా అయితదని అనుకున్నమా.? మెడికల్ కాలేజీ వచ్చింది. బ్రహ్మాండంగా అభివృద్ధి అవుతున్నది. కాంగ్రెస్‌లో 12మంది ముఖ్యమంత్రులు ఉన్నరు. ఎవడు ఎప్పుడు అయితడో వాని అయ్యకు తెల్వది. వాడు గెలిచేది లేదు.. సచ్చేది లేదు. పార్టీల చరిత్రను బేరీజు వేయాలి. ఖానాపూర్‌లో 7500 మందికి 22,470 ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చినం. 3600 పైచిలుకు తండాలను పంచాయతీలు చేసినం. చేనేత, గీత, గంగ పుత్ర, యాదవ సోదరులు, అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టినం. ఎవరికి ఓటేస్తే మంచి జరుగుతదని మీ గ్రామాలు, తండాల్లో చర్చ పెట్టాలి. అప్పుడే రాయేదో.. రత్నమేదో తెలుస్తది. మంచి సర్కారు ఏర్పాటైతది. వంద శాంత భయంకరమైన మెజార్టీతో బీఆర్‌ఎస్ గెలుస్తుంది. అని సీఎం కేసీఆర్ అన్నారు.



జగిత్యాల అభ్యర్థి సంజయ్‌కుమార్



ఖానాపూర్ అభ్యర్థి భూక్య జాన్సన్ రాథోడ్



ఖానాపూర్ సభకు హాజరైన జనం